RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం    AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana    సంచిక : 358    సంపుటి : 02    మంగళవారం 18-11-2025    పేజీలు -8    వెల: రూ. 05.00

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాప్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ పందిళ్ళ రవీందర్ (9030653934)

ఎడిటర్ పొన్నం ప్రసాద్ గౌడ్
9666992524

## బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష


- అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగం
- ఢాకా ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు



**ఢాకా, నవంబర్ 17:అక్షర వేదం**

ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రైబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు.-మిగతా 2 లో

## సౌదీలో ఘోర విషాదం



### 42 మంది భారతీయ యాత్రికులు సజీవ దహనం

**మృతుల్లో 16 మంది హైదరాబాద్ పాతబస్తీ వాసులే**

- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఉమ్రా బస్సు...
- బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు
- మక్కాకు వెళుతుండగా ప్రమాదం



**హైదరాబాద్: నవంబర్ 17:అక్షర వేదం**

ఉమ్రా యాత్రకు వెళ్లిన భారతీయ యాత్రికుల జీవితాల్లో సౌదీ అరేబియాలో జరిగిన ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. మక్కా నుంచి మదీనాకు పవిత్ర యాత్రలో ప్రయాణిస్తున్న బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో క్షణాల్లోనే మంటలు చెలరేగి, బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ హృదయ విదారక ఘటనలో మొత్తం 42 మంది భారతీయ యాత్రికులు సజీవ దహనమయ్యారు.

**మృతుల్లో అధిక శాతం హైదరాబాదీలే!**

ఈ ఘోర ప్రమాదంలో మరణించిన వారిలో అత్యధిక సంఖ్యలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వాసులే ఉన్నారు. ముఖ్యంగా పాతబస్తీలోని మల్లేపల్లి, బజార్‌ఘాట్ ప్రాంతాలకు చెందిన సుమారు 16 మంది యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నట్లు ప్రాథమిక నివేదికలు తెలుపుతున్నాయి. ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరగడం వారి కుటుంబాలకు తీరని వేదనను మిగిల్చింది.

-మిగతా 2 లో

## పాక్ మళ్లీ తెగిస్తే ఇక అంతే సంగతులు

- ఆపరేషన్ సింధూర్ పాఠాలు నేర్పింది
- ఇది కేవలం ట్రైలర్ మాత్రమే
- చాణక్య రక్షణ సదస్సులో జనరల్ ద్వివేది



**న్యూఢిల్లీ, నవంబర్ 17:అక్షర వేదం**

పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై జరిపిన మిలటరీ చర్య 'ఆపరేషన్ సిందూర్' నుంచి తాము పాఠాలు నేర్చుకున్నామని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. గతేడాది చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఒక ట్రైలర్ మాత్రమేనని, పొరుగుదేశం మళ్లీ దారి తప్పితే గుణపాఠం చెప్పేందుకు -మిగతా 2 లో



## నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలి

- పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ
- స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం

**న్యూఢిల్లీ**

తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరపున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడించారు. తెలంగాణలో ఎమ్మెల్యేల

-మిగతా 2 లో

## డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు

**ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్**

- కేబినేట్‌లో మంత్రులతో చర్చించిన సీఎం రేవంత్
- డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం

**హైదరాబాద్, నవంబర్ 17:అక్షర వేదం**

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ -మిగతా 2 లో





## బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

- రవి హార్డ్ డిస్క్‌లో 21వేలకు పైగా సినిమాలు
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేలా పైరసీ
- పైరసీ ద్వారా 20కోట్లు సంపాదించిన రవి
- 3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామన్న సిపి సజ్జన్నార్
- కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సినీ పెద్దలు

**హైదరాబాద్,నవంబర్ 17:అక్షర వేదం**

పైరసీతో సినీ పరిశ్రమకు భారీ నష్టం కలిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ అన్నారు. పైరసీని అరికట్టే క్రమంలో ఐ బొమ్మ రవిని అరెస్ట్ చేశామన్నారు. ఐ బొమ్మ రవిపై మూడు పైరసీ కేసులున్నాయని తెలిపారు. రవి.. వెబ్ సైట్ డిజైన్, డెవలపింగ్‌లో ఆరితేరాడని, సీక్రెట్ కెమెరాలతో కొత్త సినిమాలను పైరసీ చేస్తాడని తెలిపారు. దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు ఛాలెంజ్ చేసిన ఐ బొమ్మ రవి ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. రవి అరెస్ట్‌పై సీపీ సజ్జనార్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

-మిగతా 2 లో



## దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే వారిని వదలం

- పాతాళంలో దాక్కున్నా పట్టుకుని శిక్షిస్తాం
- హోంమంత్రి అమిత్ షా హెచ్చరిక

**న్యూఢిల్లీ,**

ఢిల్లీ కారు పేలుడు నిందితులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఢిల్లీ పేలుళ్ల నిందితులను ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. పాతాళంలో ఉన్నా వేటాడి పట్టుకొచ్చి మరీ కఠిన శిక్షలు పడేలా చేస్తామని హెచ్చరించారు. సోమవారం హరియాణా లోని ఫరిదాబాద్‌లో జరిగిన నార్తరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఢిల్లీ పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని మూలాల నుంచి నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. 2025, నవంబర్ 11న భారీ పేలుడుతో దేశ రాజధాని ఢిల్లీ ఒక్కసారిగా ఉలిక్కిపడిన విషయం తెలిసిందే. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఓ కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. యావత్ దేశాన్ని కుదిపేసిన ఈ ఘటనను ఉగ్రదాడిగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకి అప్పగించింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏన్ఐఏ విచారణ వేగవంతం -మిగతా 2 లో

## మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- జూబ్లీహిల్స్ ఫలితమే నిదర్శనం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- మిర్యాలగూడలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్



**మిర్యాలగూడ,/నవంబర్ 17:అక్షర వేదం**

మరో 15 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఇది రుజువైందని చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రింగురోడ్డు పనులకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో-మిగతా 2 లో

## సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం

- డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడుకోవాలి
- డిసెంబర్ 13న సిఎండి కార్యాలయ ముట్టడి
- ఖమ్మం జాగృతి బాటలో కవిత వెల్లడి



**ఖమ్మం/నవంబర్ 17:అక్షర వేదం**

డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కొట్లాడుతున్నామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ -మిగతా 2 లో

# డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు

మొదటి తరువాయి

ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రివర్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోక్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ధంకా మోగించాలని భావిస్తున్నారు.

## నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలి

మొదటి తరువాయి

అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

## దేశంలో ఉగ్రచర్యలకు పాల్పడే వారిని వదలం

మొదటి తరువాయి

చేసింది. ఇందులో భాగంగా పలువురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ కారు పేలుడుకు సంబంధించి సోమవారం మరో వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. జమ్మూకాశ్మీర్‌కు చెందిన జాసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్?ను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ కారు బ్లాస్ట్ కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో డానిష్‌కు సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాంబ్ పేలుడు కోసం ఉమర్ నబీకి డానిష్ సాంకేతిక సహాయం అందించాడని.. డ్రోన్ల ద్వారా ఉగ్రవాద దాడులకు సహకరించాడని అధికారులు వెల్లడించారు.

## సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం

మొదటి తరువాయి

ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

## మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

మొదటి తరువాయి

ఒక పార్టీకి డిపాజిట్ గల్లంతైందని.. మరో పార్టీ కుటుంబ కలహాలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్ని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారి ద్వారా అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో మిర్యాలగూడ ప్రజలు కాంగ్రెస్‌కి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రూ.180.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు మంత్రులు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతి సింగిల్ రోడ్డును, డబుల్ రోడ్డుగా చేస్తామని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మిర్యాలగూడ కేఎన్ఎం డిగ్రీ కాలేజీని.. ప్రభుత్వ కాలేజీగా మార్చింది తామేనని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ దక్కలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాలుగు ముక్కలైందని ఎద్దేవా చేశారు.

# సౌదీలో ఘోర విషాదం

మొదటి తరువాయి

ప్రమాదం జరిగిన సమయంలో బస్సులోని యాత్రికులంతా గాఢ నిద్రలో ఉండటం వల్ల, ట్యాంకర్ నుంచి లీకైన డీజిల్ కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో వారికి తప్పించుకునే అవకాశం దక్కలేదు.

ప్రమాదం జరిగిన తీరు: నిద్రలోనే నిష్క్రమణ

భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున సుమారు 1.30 గంటల ప్రాంతంలో ఈ విషాదం చోటుచేసుకుంది. మక్కా నుంచి మదీనాకు వెళ్తున్న మార్గంలో బదర్-మదీనా మధ్యలోని ముఫరహాత్ ప్రాంతంలో యాత్రికుల బస్సు అదుపుతప్పి డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే ట్యాంకర్ పేలిపోయి, భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. బస్సులో చిక్కుకుపోయిన వారంతా నిద్రలోనే కాలి బూడిదయ్యారు. బస్సులో ప్రయాణించిన వారిలో మహమ్మద్ అబ్దుల్ షోయబ్ (24) అనే యువకుడు మాత్రమే గాయాలతో ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం, అతడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**మృతుల వివరాలు (మల్లేపల్లి, బజార్‌ఘాట్ ప్రాంతాల నుంచి):**

మల్లేపల్లిలోని బజార్‌ఘాట్ ప్రాంతానికి చెందిన మృతుల వివరాలు ఇలా ఉన్నాయి: రహీమున్నీసా (60),రహత్ బీ (80),షేహనాజ్ బేగం (41),గౌసియా బేగం (46),కదీర్ మహ్మద్,మహ్మద్ మౌలానా ,షోయబ్ మహ్మద్ ,సోహైల్ మహ్మద్ ,మస్తాన్ మహ్మద్ ,పర్వీన్ బేగం ,జకియా బేగం ,షౌకత్ బేగం ,ఫర్హీన్ బేగం,జహీన్ బేగం ,మహ్మద్ మంజూర్ ,మహ్మద్ అలీ

ప్రభుత్వ స్పందన, సహాయక చర్యలు:

ఈ ఘోర ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పరిహారం: మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు:

ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను, మృతుల గుర్తింపు ప్రక్రియ, మృతదేహాలను స్వదేశానికి తరలించే విషయంలో కుటుంబ సభ్యులకు సహాయం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసింది.

సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు:

79979 59754

99129 19545

అలాగే న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కూడా మరొక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రభావిత కుటుంబాలకు రియాద్‌లోని ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష

మొదటి తరువాయి

ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్ర్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది. ఇది జులై తిరుగుబాటుగా మారింది. ఈ అల్లర్లలో 1,400 మంది వరకు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదించింది. ఆందోళనల కారణంగా హసీనా అధికారం నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అనంతరం బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ 'ను పునరుద్ధరించింది. యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ఆమే ఒకప్పుడు దీన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే ట్రైబ్యునల్ 2024 నాటి అల్లర్ల విషయంలో హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలు మోపింది. నెలల తరబడి విచారణ జరిపి సోమవారం మరణశిక్ష విధించింది. తన ఎదుగుదలకు తోడ్పడిన దేశమే ఇప్పుడు తన పతనాన్ని శాసించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు హసీనా. భారత ఆశ్రయంలో ఉంటూ సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశ్ భవిష్యత్తుపై మథనపడుతున్నారు. తనకు విధించిన మరణ శిక్షను ఖండించారు. తీర్పు మోసపూరితమన్నారు. అక్కడి ప్రభుత్వమే కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని ఆవేదన చెందారు. తనను తాను నిరూపించుకోవడానికి కోర్టు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. నాటి తూర్పు పాకిస్థాన్‌లోని తుంగిపారాలో 1947 సెప్టెంబరు 28న షేక్ హసీనా జన్మించారు. తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ ఆ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా వ్యవహరించి జాతిపితగా నిలిచిపోయారు. ఢాకా విశ్వవిద్యాలయం నుంచి బెంగాలీ సాహిత్యంలో హసీనా మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయం లోనే విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1968లో అణు శాస్త్రవేత్త ఎం.ఎ.వాజెద్ మియాను వివాహం చేసుకున్నారు. రాజకీయాలకు భిన్నంగా ఆయన విద్యావేత్తగా నిరాడంబర జీవితం గడిపారు. 2009లో ఆయన మరణించే వరకు ఆమెకు తోడుగా ఉన్నారు. వారికి సజీబ్ వాజెద్ జాయ్ అనే కొడుకు, సైమా వాజెద్ పుతుల్ అనే కూతురు ఉన్నారు. 1975 ఆగస్టులో జరిగిన సైనిక తిరుగుబాటు హసీనా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ ఘర్షణల్లో ఆమె తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు ఇంకా కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు. ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల హసీనా, ఆమె చిన్న చెల్లెలు రెహానా మాత్రమే బతికి బయటపడ్డారు. నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఆమెకు ఆశ్రయం ఇచ్చారు. ఆరు సంవత్సరాల తర్వాత 1981 మేలో బంగ్లాదేశ్‌కు హసీనా తిరిగొచ్చారు. దేశానికి రాకముందే ఆమెను అవామీ లీగ్ పార్టీ తమ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దేశానికి తిరిగి వచ్చే సరికే హసీనా ప్రధాన ప్రత్యర్థి ఖలీదా జియా ఆమె కోసం వేచి చూస్తున్నారు.

# పాక్ మళ్లీ తెగిస్తే ఇక అంతే సంగతులు

మొదటి తరువాయి

సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన 'చాణక్య రక్షణ సదస్సు'లో ఆయన మాట్లాడుతూ, 88 గంటలపాటు సాగించిన 'ఆపరేషన్ సిందూర్' ఒక ట్రైలర్ మాత్రమేనని అన్నారు. 'భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లు ఎదురైనా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ తిరిగి దారి తప్పితే ఎలా బాధ్యతగా వ్యవహరించాలో గుణపాఠం నేర్పిస్తాం' అని జనరల్ ద్వివేది అన్నారు. ఎప్పుడు ఆపరేషన్ చేపట్టినా దాని నుంచి కొన్ని విషయాలు నేర్చుకోవడం జరుగుతుందని, త్రివిధ దళాల మధ్య సమన్వయం, సరఫరాలు సక్రమంగా అందేలా చూసుకోవడం, ప్రతి దశలోనూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి చాలా కీలకమైనవిగా 'ఆపరేషన్ సిందూర్' నుంచి గ్రహించినట్టు చెప్పారు. అతి తక్కువ సమయం లోనే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ప్రతి దశలోనూ సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అనివార్యమని చెప్పారు. బలగాల మధ్య సమన్వయం చాలా అవసరమని, అందులోనూ యుద్ధాలు ఇవాళ బహుళ మాధ్యమాల్లో జరుగుతున్నాయని అన్నారు. భూమి, ఆకాశం, సైబర్ రంగం, సమాచార యుద్ధం... వెరసి సమగ్ర యుద్ధం అవుతోందన్నారు. ఆర్మీ మాత్రమే యుద్ధం సాగించలేదని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా యుద్ధం సాగించాల్సి ఉంటుందని చెప్పారు. ఇవాళ యుద్ధం అంటూ వస్తే ఎన్ని గంటలు జరుగుతుందో చెప్పలేమని, ఆపరేషన్ సిందూర్ 88 గంటలపాటు సాగించామని, వచ్చేసారి నాలుగు నెలలైనా కావచ్చు, నాలుగేళ్లూ పట్టవచ్చని అన్నారు. ఇలాంటప్పుడు యుద్ధానికి సరిపడినన్ని ఆయుధాలు మన వద్ద ఉన్నాయా? అనేది చూసుకోవాలని, లేనిపక్షంలో అందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రఘటన అనంతరం భారత్ తీసుకువచ్చిన 'న్యూ నార్మల్' విధానంపై మాట్లాడుతూ, ఒకే సమయంలో చర్చలు, ఉగ్రవాదం కొనసాగలేవని చాలా స్పష్టంగా ఈ విధానంలో చెప్పడం జరిగిందన్నారు. ఒక దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంటే, అది ఇండియాకు ఆందోళన కలిగించే విషయమని, ప్రగతిని ఇండియా కోరుకుంటోందని, అందుకు అవరోధం కలిగించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. శాంతియుత పక్రియకు భారత్ సహకరిస్తుందని, అప్పటివరకూ ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేస్తున్న వారికి ఒకే రీతిన గుణపాఠం చెబుతుందని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై మాట్లాడుతూ, 370వ అధికరణ రద్దు తర్వాత ఉగ్రవాద ఘటనలు తగ్గాయని చెప్పారు.

# బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

మొదటి తరువాయి

ఆయన పైరసీపై సంచలన విషయాలు బయటపెట్టారు. ఐ బొమ్మ రవి హార్డ్ డిస్క్ లలో దాదాపు 21 వేలకు పైగా సినిమాలు ఉన్నాయని తెలిపారు. పైరసీ ద్వారా రవి రూ. 20 కోట్లు సంపాదించాడని, అందులో రూ. 3 కోట్లు ఫ్రీజ్ చేశామని చెప్పారు. రవికి ఇంటర్నేషనల్ లింక్స్ ఉన్నాయని, ఈ కేసు చేధించేందుకు జాతీయ స్థాయి సంస్థల సహకారం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐ బొమ్మ రవి దగ్గర 50 లక్షల మంది సమాచారం ఉందని వెల్లడించారు. డేటా కలెక్షన్ కోసం ఐ బొమ్మ రవి మాస్టర్ మైండ్ ఉపయోగించాడని సీపీ వివరించారు. ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే.. మరో సైట్‌ను డెవలప్ చేస్తాడని వెల్లడించారు. రవి సైట్ ఓపెన్ చేయగానే బెట్టింగ్ యాప్స్ అట్రాక్ట్ చేస్తాయని, బెట్టింగ్ యాప్స్‌తో జనం వేల కోట్లు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కస్టడీకి ఇస్తే ఐ బొమ్మ రవి నుంచి పూర్తి వివరాలు రాబడుతామని, ఆయన నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సోమవారం హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు, దగ్గుబాటి సురేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో చాలా మంది చనిపోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని సజ్జనార్ వెల్లడించారు. విశాఖకుచెందిన ఇమ్మడి రవి బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులు తీసుకున్నాడు. మొదటి నుంచి నేర ప్రవృత్తితో ఉన్నాడు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐబొమ్మ ప్రారంభించి 21 వేల సినిమాలు పైరసీ చేశాడు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడు. 110 డొమైన్స్ కొనుక్కున్నాడు. ఒకటి బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ చేస్తూ పైరసీ సినిమాలు విడుదల చేశాడు. ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం అని సజ్జనార్ తెలిపారు. ఇదిలావుంటే ఈ కేసులో కీలకంగా వ్యవహరించి రవిని అరెస్ట్ చేసిన పోలీస్‌లను సినీ ప్రముఖులు చిరంజీవి, రాజమౌళి తదితరులు సన్మానించారు.

# విజయవంతంగా 20వ జాతీయ కరాటే పోటీలు






**అక్షర వేదం/హైద్రాబాద్: నవంబర్ 17,**
బాలల దినోత్సవం సందర్భంగా జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 16న హైద్రాబాద్ ఎల్.బి.ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 20వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ -2025 అతి భారీ విజయంతో ముగిసింది. దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుండి 850 మంది కరాటే విద్యార్థులు,కోచ్‌లు,అథ్లెట్లు పాల్గొని పోటీలను అద్యంతం ఉత్కంఠభరితంగా మార్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా అధ్యక్షతగా డా. సౌమ్యా మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా మాట్లాడుతూ, “ఇలాంటి జాతీయ స్థాయి కరాటే పోటీలు కేవలం క్రీడాకారుల ప్రతిభను మాత్రమే కాకుండా బాలికలు,మహిళల్లో ఆత్మవిశ్వాసం,ధైర్యం,స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించటంలో అపూర్వమైన పాత్ర పోషిస్తాయి అన్నారు. ఈరోజు సమాజంలో మహిళలు ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారు. వారికి శారీరక శక్తి మాత్రమే కాదు, మానసిక బలం కూడా సమానంగా అవసరం .స్వీయ రక్షణ ఒక నైపుణ్యం మాత్రమే కాదుఅది ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తన జీవితంలో కలిగి ఉండాల్సిన హుక్కు కవచం. జివిఆర్ కరాటే అకాడమీ ఇలాంటి శక్తివంతమైన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయం అన్నారు. అమ్మాయిలు ధైర్యంగా ముందుకు రావాలి అని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రమణ్ గౌడ్, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, లయన్స్ క్లబ్ 320D ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా. విజయలక్ష్మి, డిలైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అకాడమీ డైరెక్టర్ డా.జి.ఎస్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సెన్సైలకు ఉచిత యాక్సిడెంట్ & మెడికల్ పాలసీ బ్లేజర్లు, పాల్గొనేవారికి ఆకర్షణీయమైన టీ-షర్టులు,పారా కరాటే ఆటగాళ్లకు ఉచిత ప్రవేశం, మెడికల్ క్యాంప్ వంటి ప్రత్యేక సదుపాయాలు అందించామని తెలిపారు. అండర్ 10 వయస్సు నుండి సీనియర్ సిటిజన్ వరకు అమ్మాయిలు అబ్బాయిలు. కేటగిరీల్లో కాటా, కుమితి పోటీలు అత్యంత ప్రతిభాపూర్వకంగా జరిగాయి. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థుల అద్భుత మల్కామ్ ప్రదర్శన మార్చ్ పాస్ట్ నిర్వహించారు. అనంతరం ఆకర్షణీయమైన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరి దృష్టిని ఆకట్టుకున్నాయి. అమ్మాయిల విభాగంలో వైష్ణవి అద్భుత ప్రతిభతో ‘విజేత’గా నిలిచి ప్రేక్షకులను ఆకట్టుకోగా, బాయ్స్ విభాగంలో విశాల్ అత్యుత్తమ నైపుణ్యంతో ‘విజేత’గా నిలిచి అందరి ప్రశంసలు పొందాడు. వెటరన్ కేటగిరీలో కూడా పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 40 ఏళ్ల విభాగంలో గజల్ పాషా విజేతగా నిలిచాడు. 50 ఏళ్ల విభాగంలో లక్ష్మణ్ రావు అసాధారణ ప్రదర్శన చేసి మొదటి స్థానాన్ని సాధించారు. వెటరన్ వెపన్స్ ఛాంపియన్‌షిప్‌లో కూడా లక్ష్మణ్ రావునే విజేతగా నిలిచి తన అనుభవం, నైపుణ్యాన్ని మరొకసారి రుజువు చేశారు. హాజరైన అతిథులు, తల్లిదండ్రులు,కోచ్‌లు జివిఆర్ కరాటే అకాడమీ నిర్వహణను అభినందించారు. యువతలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించే ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు మరింతగా జరగాలని కోరారు.

# రాజీవ్ రహదారి పై ప్రమాదాల నివారణకు చర్యలు: సీపీ అంబర్ కిషోర్

**ప్రమాద స్థలాల గుర్తింపు.... ప్రమాదాల నివారణ చర్యలకు దిశా నిర్దేశం...**
**బ్లాక్ స్పాట్ ను సందర్శించిన రామగుండం పోలీస్ కమీషనర్**



**అక్షరవేదం /గోదావరిఖని: నవంబర్ 17**
రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ఏర్పాటుచేసిన అరైవ్ & అలైవ్’ రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా సీపీ పేర్కొన్నారు. రాజీవ్ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాల వలన ప్రజల ప్రాణల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాల నివారణ చర్యలకు డిజిపి చేపట్టిన “అరైవ్.. అలైవ్” కార్యక్రమం లో భాగంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, హెచ్ కె ఆర్ సంస్థ అధికారులతో కలిసి గోదావరిఖని బి - గెస్ట్ హౌస్ మూల మలుపు వద్ద, ఇందారం క్రాస్ రోడ్ వద్ద బ్లాక్ స్పాట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మూలమలుపు వద్ద ఏర్పాటు చేస్తున్నా ఐలాండ్ ల ఏర్పాటు డిజైన్, గతంలో ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, ప్రమాదాల నివారణ చర్యలు, రేడియం బ్లింకర్స్, స్టడ్స్, సిసి కెమెరాల ఏర్పాటు ప్రమాద స్థలాల గుర్తింపు, తదితర అంశాలపై అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. రోడ్డు సేఫ్టీ కమిటీ లు ఏర్పాటు చేసి ప్రమాదాలపై క్షేత్ర స్థాయిలో బ్లాక్ స్పాట్ లను సందర్శించి, కారణాలపై సమీక్షా జరిపి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సీపీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు గురై ఎన్నో కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని, కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తు పెట్టుకొని ప్రజల్లో భద్రతపై తప్పనిసరిగా అవగాహన పెరగాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి, ప్రమాదరహిత రామగుండం కమీషనరేట్ గా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని సీపీ స్పష్టం చేశారు. అరైవ్ అలైవ్ ద్వారా విద్యార్థుల్లో, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, రోడ్ సేఫ్టీ టీమ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలను సందర్శించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టి కమిషన్

**అక్షరవేదం/ గోదావరిఖని: నవంబర్17**
రామగుండం గురుకుల కళాశాల సమస్యలను వివరించిన గురుకుల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సతీష్, పేరెంట్స్ కమిటీ నాయకులు...





రామగుండం గురుకుల కళాశాల కు వెళ్లే దారి త్వరితగతి నిర్మించాలని , విద్యార్థులకు క్రీడా మైదానం, కళాశాల భవనాన్ని పెయింటింగ్, కలరింగ్ వేయించాలని, పిల్లలకు నీటి సౌకర్యం కోసం బోర్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని రామగుండం గురుకుల కళాశాలకు పర్మనెంట్ ప్రిన్సిపాల్ ను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పేరెంట్స్ కు కళాశాలలో పేరెంట్స్ వెయిటింగ్ హాల్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కళాశాలలో జనరేటర్ సదుపాయం కల్పించాలని గురుకుల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సతీష్, పేరెంట్స్ కమిటీ నాయకులు, విద్యార్థులతో కలిసి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రేణిగుంట్ల ప్రవీణ్, నీలా దేవి, రాంబాబు నాయక్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా ఎస్సి ఎస్టి కమిటీ సభ్యులు బొంకూరి మధు లని కోరారు. హాస్టల్ ను సందర్శించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, మాట్లాడుతూ.. తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థుల భవిష్యత్తు కోసం తగిన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా చూడాలని ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం కు తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ ద్వారా రామగుండం గురుకుల కళాశాలకు వచ్చే వాటర్ నల్లను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి బోజన వసతులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల డి సి ఓ దేవసేన, కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, కళాశాల ఎస్విపి, జె వి పి రజిత, పేరెంట్స్ కమిటీ నాయకులు రామగుండం గురుకుల కళాశాల చైర్మన్ ఉషారాణి మురళి, మాధవి, భాగ్యలక్ష్మి, అంజలి, సంధ్యారాణి, రజిత, సభ్యులు, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా నంగనూరు చంద్రశేఖర్ గుప్తా..

**- పిర్జాదిగూడ ఆర్యవైశ్య సంఘం కార్తీక వనభోజనాలు,**
**- నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవం..**





**అక్షర వేదం/ మేడ్చల్ మల్కాజ్గిరి/ మేడిపల్లి: పిర్జాదిగూడ,నవంబర్ 17,**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా పీర్జాదిగూడ బీజేపీ సెక్రటరీ( ఈస్ట్) నంగనూరు చంద్రశేఖర్ గుప్తాను సంఘం సభ్యులు ఎన్నుకున్నారు.. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు, అనంతరం ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా నంగనూరు చంద్రశేఖర్ గుప్తాను, అధ్యక్షుడిగా వెచ్చా అరవింద్ కుమార్, కోశాధికారి ఎం. వెంకటేశం లను ఎన్నుకున్నారు. వీరిని మేడిపల్లి మండల అధ్యక్షులు వెచ్చ వెంకట్ కుమార్ గుప్తా మరియు మేడిపల్లి మండల కార్యదర్శి కటకం శేఖర్ గుప్తా మరియు అమావాస్య అన్న ప్రసాద అధ్యక్షులు రాజరాజు గుప్త మరియు బిజెపి సీనియర్ నేత డాక్టర్ చికోటి ప్రవీణ్ గుప్త ఆధ్వర్యంలో ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయవాది ఎస్ఎస్.రావుకు తెలంగాణ మేధావుల ఫోరం ఘన సన్మానం



**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వేదం) :**
గత 26 ఏళ్లుగా నిర్విరామంగా హైకోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తూ నిరుపేదలకు న్యాయం శాస్త్రంపై, చట్టాలపై అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్న ప్రముఖ హైకోర్టు న్యాయవాది సోమ శ్రీనివాసరావు(ఎస్ఎస్. రావు)ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్కరికి నియమించే హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్, అఫీషియల్ ట్రస్ట్ ఆఫ్ తెలంగాణ నియమించినందుకు తెలంగాణ మేధావులు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ నేతృత్వంలో శాలువా, జ్ఞాపిక పూలమాలతో హైకోర్టులోని తన చాంబర్లో సోమవారం ఘనంగా సన్మానించారు. తనను నియమించిన సీఎం రేవంత్ రెడ్డితో పాటు సహకరించిన మంత్రులు, శ్రీధర్ బాబు, సీతక్క, మాజీ మంత్రి కె.జానరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎస్.రావు గతంలో ఎన్.ఎస్.యు.ఐ, యువజన కాంగ్రెస్ శాఖలలో 25 ఏళ్లుగా అనేక న్యాయపరమైన సమస్యలను, పార్టీ కార్యకర్తలకు తన శిబిరాల ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ వాదుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి డిఎల్.పాండు, తెలంగాణ హైకోర్టు మాజీ ప్రధాన కార్యదర్శి నరేందర్, సీనియర్ న్యాయవాది శ్రీకృష్ణశర్మ, శాతవాహన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి, న్యాయవాది డివి.శ్రీకాంత్, యువ హైకోర్టు న్యాయవాది కుమారి కె.అఖిల, టి.ఐ.ఎఫ్ కో-ఆర్డినేటర్ జి.వేణుగోపాల్ తదితరులు ఎస్ఎస్.రావును ఘనంగా సన్మానించి అభినందించారు.

## కార్డియోజెనిక్ షాక్‌లో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడిన కేర్ వైద్యులు



**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వేదం) :**
తీవ్ర కార్డియోజెనిక్ షాక్‌లో ఉన్న హైదరాబాదుకు చెందిన 49 ఏళ్ల వ్యక్తికి అత్యవసర యాంజియోప్లాస్టీ చేసి ప్రాణాలను కాపాడినట్లు మలక్‌పేట కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేర్ హాస్పిటల్స్ కు వచ్చిన రోగికి సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్ చెరుకు పరీక్షలు చేసి అత్యవసర ఇమేజ్ గైడెడ్ యాంజియోప్లాస్టీ విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఎడమ ప్రధాన ధమనిలో ఉన్న అడ్డంకిని తొలగించి, ఎడమ ప్రధాన కరోనరీ ధమనిలో స్టెంట్‌ను అమర్చారని, దీంతో రక్తప్రసరణ సవ్యంగా పునరుద్ధరించబడిందని తెలిపారు. రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి, వెంటిలేటర్ నుంచి విడదీసి ఐదు రోజులకే డిశ్చార్జ్ చేశామన్నారు.

# మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం 'శ్రావణి ఆద్యం'

**-ప్రారంభించిన తెలంగాణ ఇంటెలిజెన్స్ ఎస్పీ శిరీష రాఘవేంద్ర**



**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వేదం) :** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని, శ్రావణి హాస్పిటల్స్ సంస్థ 'శ్రావణి ఆద్యం' పేరుతో తల్లి, బిడ్డల కేంద్రాన్ని తెలంగాణ ఇంటెలిజెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శిరీష రాఘవేంద్ర చేతుల మీదుగా ప్రారంభించినట్లు శ్రావణి హాస్పిటల్స్ ఫౌండర్, సీఈఓ శ్రావణి చెట్టుపల్లి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, దయాభావంతో కూడిన నిపుణుల నైపుణ్యంతో మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి టెక్నాలజీని, సంరక్షణతో తల్లికి ప్రాధాన్యత ఇచ్చే పద్ధతిని ఇంటెలిజెన్స్ ఎస్పీ శిరీష రాఘవేంద్ర ప్రశంసించినట్లు తెలిపారు.

# జిఎం ఆఫీస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఐఎన్టియుసి



**అక్షరవేదం /గోదావరిఖని: నవంబర్ 17** రామగుండం1 జిఎం ఆఫీస్ లో పనిచేసే ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఐ ఎన్ టి యు సి అర్జీ1 ఏరియా ఉపాధ్యక్షులు కచ్చకాయల సదానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు జిఎం ఆఫీస్ ఉద్యోగులు, ఐఎన్టియుసి నాయకులు కలిసి సోమవారం అర్జీ వన్ పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ డిపార్ట్మెంట్, ఆడిట్ సెక్షన్ రూమ్ లలో వెంటిలేషన్ సరిగా లేకపోవడం వలన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగులకు బైక్ పార్కింగ్, సబ్సిడీ క్యాంటీన్, వాష్ రూమ్ సౌకర్యం లేదని, యాజమాన్యం వెంటనే సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణ, గుండేటి శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ ఎండీ జబ్బార్, ఎల్. ఆంజనేయులు, రమేష్, భాస్కర్, మహిళా ప్రతినిధి దివ్యారెడ్డి, వెంకటేష్, భాస్కర్, శ్రీనివాస్, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వీల్ చైర్స్ సహాయం

**-పవన్ బాబు మోహన్ చారిటేబుల్ ట్రస్ట్ సహకారంతో**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/జవహర్ నగర్: నవంబర్ 17,** తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో, పవన్ బాబు మోహన్ చారిటేబుల్ ట్రస్ట్ సహకారంతో జవాహర్ నగర్ వికలాంగుల కాలనీకి చెందిన సుమలత, క్రిష్ణ అనే దివ్యాంగులకు రెండు వీల్ చైర్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం సినీ నటుడు ట్రస్ట్ చైర్మన్ పవన్ బాబు మోహన్ ఆదేశాల మేరకు. ట్రస్ట్ కోర్డినేటర్స్ కె బాను రెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, రాష్ట్ర కార్యధర్శి మెరుగు శివక్రిష్ణ, నాగరాజు, అప్పారావు, మరియు సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్






**నుజ్జు నుజ్జు అయిన విద్యార్థిని ఎడమ చెయ్యి. విద్యార్థిని మేఘనకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలి.. ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**

**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 17** గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న మేఘన అనే విద్యార్థిని చేతి పైనుండి బస్సు ఎక్కించిన కరీంనగర్ డిపో- 2 బస్సు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని సోమవారం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ.. గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హెచ్ఈసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న మేఘన అనే విద్యార్థిని కళాశాల అయిపోగానే గోదావరిఖని బస్టాండు నుండి ఎఫ్ సి ఐ ఇంటికి బయలుదేరు సమయంలో గోదావరిఖని బస్టాండ్ లో బస్సు ఎక్కేటప్పుడు బస్సు డ్రైవర్ దురుసుగా వెనక్కి బస్సు తీయడం వల్ల విద్యార్థిని కింద పడిపోవడం జరిగిందని, విద్యార్థిని చేతి పై నుండే బస్సును ఎక్కించడం వల్ల విద్యార్థిని చెయ్యి నుజ్జునుజ్జు కావడం జరిగిందని ఆయన అన్నారు. దీనికి కారణం బస్సు డ్రైవర్ దురుసుగా నడపడమే కారణమని అక్కడ ఉన్నటువంటి విద్యార్థులు చెప్పడం జరిగిందని ఆయన అన్నారు. కరీంనగర్ డిపో- టు కు చెందిన పల్లె వెలుగు బస్సు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థిని చెయ్యి మెరుగయ్యేంతవరకు బస్సు డ్రైవర్ బాధ్యత వహించాలని, దురుసుగా మాట్లాడుతున్న గోదావరిఖని బస్ డిపో మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బస్సు పాస్ సౌకర్యం ఉన్న విద్యార్థులను బస్సు ఎక్కించుకోకుండా బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు సమయం ఇవ్వాలని, అందరూ బస్సు ఎక్కాకే బస్సును స్టార్ట్ చేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుండేటి తరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మంథని పట్టణంలోని వీధి కుక్కల సమస్య హైకోర్టుకు చేరింది



**అక్షర వేదం/మంథని,నవంబర్17:** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పెద్ద ఎత్తున ఉన్న వీధి కుక్కల బెడద విషయంలో హైకోర్టులో దాఖలు అయిన రిట్ పిటిషన్ పై సోమవారం నాడువిచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి కేసులో ప్రతివాదిగా ఉన్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు, మంథని మున్సిపల్ కమిషనర్ కు నోటీసులు జారీ చేస్తూ కేసును డిసెంబర్ 8వ తేదీకి వాయిదా వేసినట్టు మంథనికి చెందిన పిటిషనర్,హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వీధి కుక్కలు సైర విహారం చేస్తూ రాత్రి అంతా మొరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా దారిన వెళ్తున్న వారిని కరుస్తూ పలువురిని ఆందోళన గురి చేస్తున్న విషయంతో పాటు,మంథని మున్సిపల్ పరిధిలో గల 7వ వార్డు లోని భగత్ నగర్, ఉస్మాన్ పుర,దొంతుల వాడ, రావుల చెరువు కట్ట,విశ్వ బ్రాహ్మణ వీధి,రజక వాడ లో పెద్ద ఎత్తున కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయ బ్రాంతులకు గురి చేస్తు,ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వీధి కుక్కల విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు,మంథని మున్సిపల్ కమిషనర్ కు ఆగస్టు 12,14 తేదీల్లో ఫిర్యాదు చేసిన వీధి కుక్కల అదుపునకు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండ నిర్లక్ష్యం వహించారు.వీధి కుక్కల అదుపు కోసం ఫిర్యాదు చేసి మూడు నెలలు అయిన మున్సిపాలిటీ తగు చర్యలు తీసుకోకపోవడంతో మంథని మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులు,హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ తో పాటు ఇటీవల 7వ వార్డులో కుక్క కాటుకు గురైన కొల్లూరి సమ్మయ్యతో కలిసి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు అయింది.ఈమేరకు సోమవారం రోజున హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేనా రెడ్డి రిట్ పిటిషన్ పై విచారణ జరిపి వీధి కుక్కల అదుపులో నిర్లక్ష్యం వహించిన కేసులో ప్రతివాదిగా ఉన్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు, మంథని మున్సిపల్ కమిషనర్ కు నోటీసులు జారీ చేస్తూ కేసును డిసెంబర్ 8వ తేదీకి వాయిదా వేశారు.కాగా ప్రతివాదుల తరపున మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పుట్ట కృష్ణరెడ్డి వీధి కుక్కల విషయంలో సుప్రీం కోర్టు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసిందని,అట్టి ఆదేశాల అమలుకు కృషి చేస్తామని,మంథని మున్సిపల్ కమిషనర్ గత నెల 17న విధుల్లో చేరిన కారణంగా పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రం తమ దృష్టికి రాలేదని తమ కౌంటర్ లో వివరించారు.కాగా పిటిషనర్ తరపున హైకోర్టు సీనియర్ న్యాయవాది కొంగల మోహన్ గౌడ్ తమ వాదనలు వినిపించారు. అయితే ఇప్పటికే వీధి కుక్కల అదుపునకు దేశ స్థాయిలో సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకొని దేశంలో ఉన్న పలు రాష్ట్రాలకు వీధి కుక్కల అదుపు కోసం పలు మార్గదర్శకాలు,ఆదేశాలు ఇటీవల జారీ చేయగా దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేసింది.అదేవిధంగా ఇప్పుడు హైకోర్టు ఇచ్చిన నోటీసుల మేరకు మంథని మున్సిపల్ పరిధిలో ఇప్పటికైనా వీధి కుక్కల బెడద తీర్చాలని పిటిషన్ దారుడు హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ ఒక ప్రకటనలో జిల్లా అధికారులను కోరారు..

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలతోనే ప్రజల సమస్యలు పరిష్కరింపబడతాయి

**- నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**



**అక్షర వేదం /మరిపెడ మండల కేంద్రం :- నవంబర్ 17.** ప్రజా పోరాటాలతోనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మెడల వంచి ప్రజల సమస్యలు పరిష్కరింపబడతాయని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు.సిపిఐ మరిపెడ మండల కౌన్సిల్ సమావేశం మండల కేంద్రంలో జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు నిర్వహించే ఉద్యమాలకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నప్పుడే ప్రజలకు మౌలిక వసతులు కల్పించ బడతాయని పోరాటాలు లేకుండా పాలక పార్టీలు ప్రజల సమస్యలు తీర్చవని అన్నారు.సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ఖమ్మం లో జరుగుతున్న సందర్భంగా ఈ నెల 21న బస్సు జాత కురవి, డోర్నకల్ మండలాలకు వస్తున్న సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని కోరారు.మునుపెన్నడూ లేని విధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబించే కార్పొరేట్ అనుకూల విధానాల వలన దేశంలో సంపద కేవలం కొద్దిమంది చేతుల్లో పోగుపడడం తో అసమానతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయని దీనితో ప్రజలలో కొనుగోలు శక్తి కోల్పోయి ,పేదరికంలోపలికి నెట్టివేయబడి ప్రజలలో ఆందోళన, అశాంతి, అలజడి పెరిగిపోయాయని అన్నారు అభివృద్ధి స్థానంలో మతతత్వ ,విచ్ఛిన్నకర, ఫాసిస్ట్ పాలన సాగించే బిజెపి విధానాలపై ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని కోరారు.ఈ సమావేశం లో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్ ,తురక రమేష్, బానోత్ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# మాభూమి..మాకే కావాలి..!




**- మా భూమి మాకే కేటాయించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కోరిన దళిత కాలనీ వాసులు...**

**అక్షరవేదం /గోదావరిఖని: నవంబర్ 17**

పెద్దపల్లి జిల్లా లింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో లెదర్ ఫ్యాక్టరీ కొరకు కేటాయించిన భూమిని సందర్శించడానికి వచ్చిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కి వినతి పత్రం ఇచ్చిన లింగాపూర్ గ్రామస్తులు. గత కొంతకాలం నుండి లింగాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో లెదర్ ఫ్యాక్టరీ నిర్మించాలని అనేక దళిత సంఘాలు ఎస్సీ ఎస్టీ కమిషన్ నుంచి ఒత్తిడి తీసుకొచ్చి ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో ఆ భూమిని కేటాయించినట్లు ప్రకటన చేశారు. కాగా ఈ విషయంపై లింగాపూర్ లోని వివిధ పార్టీలకు



సంబంధించిన నాయకులు, దళిత కాలనీకి చెందిన ప్రజలందరూ సోమవారం అక్కడికి చేరుకొని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ ని కలిశారు. ఇది గతంలో లింగాపూర్ ఎస్సీ కాలనీ కోసం కేటాయించిన భూమి అని ఇక్కడ లెదర్ ఫ్యాక్టరీ పడడం వల్ల దళిత కాలనీ ప్రజలకు అన్యాయం జరుగుతుందని అలాగే లింగాపూర్ ఓపెన్ కాస్ట్ వలన ముంపుకు గురైన ఎస్సీ కాలనీ పునరావాసం కింద ఇక్కడ భూమి ని కేటాయించాలని గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని వారి దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి ఆ భూమిలో ఏ ఇండస్ట్రీ గాని చేపల చెరువు గాని పెట్టవద్దని ఆ భూమిని మా ఇంటి స్థలాల కొరకే కేటాయించాలని కోరగా దానికి సానుకూలంగా స్పందించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఈ విషయాన్ని కలెక్టర్ కి ఆదేశిస్తానని వేరేచోట లెదర్ ఫ్యాక్టరీ కి భూమిని కేటాయించాలని చెప్తానని అన్నారు. దీనికి ఎస్సీ కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మరాజుల రవి, ఇరికిల్ల శంకరయ్య, కాసర్ల మల్లేష్, అర్సనపెల్లి శ్రీనివాస్, కాంపెల్లి చంద్రయ్య, ఇరికిల్ల శ్రావణ్, ఇరికిల్ల శ్రీనివాస్, గాలి ఎల్లయ్య, శివయ్య, తిరుపతి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఖని విద్యార్థినికి గోల్డ్ మెడల్..

**- ఏఐ లో ప్రతిభ కనబరచిన సింగరేణి కార్మికుడి బిడ్డ..**

**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్17**

హుజురాబాద్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని కైలాస మోనా జెఎన్టీయు ఆఫిలియేటెడ్ కాలేజీలన్నింటిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచి బీ.టెక్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్) విభాగంలో బంగారు పతకం సాధించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ ఏరియా కు చెందిన, సింగరేణి ఆర్జి-3 ఏరియా ఓసీపీ-2 లో డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్న కైలాస లక్ష్మీకాంతరావు-సంధ్యారాణి దంపతుల ద్వితీయ కుమార్తె మోనా చిన్ననాటి నుంచే చురుకుదనంతో చదువులో ముందంజలో ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. నాలుగో తరగతిలోనే ప్రతిభ కనబర్చిన మోనాను స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించి, తల్లిదండ్రులుగా తమను సన్మానించిన విషయాన్ని




వారు గుర్తుచేసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ కోర్సులో ప్రవేశం పొందినప్పటి నుంచే మోనా పట్టుదలతో పాఠ్యాంశాన్ని ఆకళింపు చేసుకుందని, కళాశాల అధ్యాపకుల సూచనలతో పాటు స్వయంగా గూగుల్ ద్వారా విషయ పరిజ్ఞానాన్ని మరింత విస్తరించుకుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం అందించిన సహకారం, ప్రత్యేక శ్రద్ధ మోనా విజయానికి ప్రధాన కారణమని అన్నారు. ఈ సందర్భంగా మోనా మాట్లాడుతూ.. డిపార్ట్మెంట్ హెడ్, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగానని తెలిపింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సహకారం తనకు బలాన్నిచ్చిందని తెలిపింది. కాగా కిట్స్ కళాశాల యాజమాన్యం మోనాను సోమవారం అభినందించింది. త్వరలో జరగనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో మోనాకు బంగారు పతకాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపింది.

# సిబిఐ ఎదుట హాజరైన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

**-గట్టు వామన్ రావు దంపతుల హత్య పై సిబిఐ విచారణ..**

**-మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ దంపతులు**

**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్17**

పెద్దపల్లి జిల్లా జిల్లాలో జరిగిన గట్టు వామనరావు దంపతుల హత్య కేసులో సిబిఐ ఎదుట హజరైన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దంపతులు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సిబిఐ విచారణకు పుట్ట మధు దంపతులు హాజరయ్యారు. గట్టు వామన్ రావు - నాగమణి న్యాయవాద దంపతులు హత్య కేసులో సిబిఐ విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే కేసుతో సంబంధం ఉన్న పలువురిని విచారించారు. విచారణ అనంతరం పుట్ట మధు మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయంగా



అనగదొక్కెందుకే శ్రీధర్ బాబు వామన్ రావు హత్య కేసులో మా దంపతుల పేర్లను చేర్చారని అన్నారు. శ్రీధర్ బాబు సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు కాబట్టే సిబిఐ వరకు వెళ్లారు. ఇదేవిధంగా మంథని మధుకర్ హత్య కేసును ఎందుకు సిపిఐ కి అప్పగించలేదని శ్రీధర్ బాబు సమాధానం చెప్పాలన్నారు. మా మేనల్లుడు ఈ కేసుతో సంబంధం ఉందని మమ్మల్ని ఈ కేసులోకి లాగారని, సిబిఐ అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పామని తెలిపారు. మంథని రాజకీయంలో ప్రత్యర్థులు ఉండొద్దనే నేపంతో మాపై ఈ అభియోగం మోపారని, సమాజం ముందుర నన్ను మా భార్య ను దోషులుగా చిత్రీకరించేందుకు ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు కుట్రలు చేస్తున్నారన్నారు. గతంలో మంథని లో జరిగిన మధుకర్ కేసు హైకోర్టులోనే ఉందని, ప్రస్తుతం లాయర్ గట్టు వామన్ రావు కేసు సుప్రీంకోర్టుకు వెళ్లడానికి కారణం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు. ప్రజాసేవ చేస్తున్న తనతో పాటు నా భార్యపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా తనను, బీఆర్ఎస్ పార్టీని అనుగదొక్కెందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని సిబిఐ విచారణను స్వాగతిస్తున్నానని తెలిపారు. గట్టు వామన్ రావు హత్య కేసులో నిందితుడు కుంట శ్రీనివాస్, తన మేనల్లుడు కావడం వల్ల మాట్లాడానని ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. చట్టాలు, న్యాయ స్థానాలపై తమకు పూర్తిగా నమ్మకం ఉందని పుట్ట మధు పేర్కొన్నారు.

# పార్టీపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు: పొంగులేటి

**అక్షర వేదం /ఖమ్మం జిల్లా:-నవంబర్ 17.**

కాంగ్రెస్ పార్టీ పరంగా BC లకు 42% రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని మంత్రి పొంగులేటి తెలిపారు.

**తొలుత సర్పంచ్ ఎలక్షన్స్ ప్రకటన**

వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.3వేల కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగంలిఅయ్యే అవకాశం.ఉండటంతో తొలుత సర్పంచ్ ఎలక్షన్స్. హై కోర్టు తీర్పు అనంతరం ఎంపీ.టీ.సి , జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్తామన్నారు.



# నేడు మహబూబాబాద్ జిల్లాకు మాజీ మంత్రి హరీష్ రావు



**అక్షర వేదం/కురవి మండలం, రాజోలు గ్రామం:-నవంబర్ 17.**

నేడు అనగా 18.11.2025 మంగళవారం రోజున
ఉదయం 11.00 గంటలకు మాజీ మంత్రి వర్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ను సందర్శిస్తారు..
అనంతరం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు తోట రవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు...
మీ
కవిత మాలోత్
భారాస జిల్లా అధ్యక్షులు
మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు

# మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి,సత్యవతి రాథోడ్


**అక్షర వేదం/ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ :-నవంబర్ 17.**



మహబూబాబాద్ జిల్లా మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ మానవత్వం చాటుకున్నారు . రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడిన వారికి సాయం చేశారు . అసలేం జరిగిందంటే .. కలెక్టరేట్ వద్ద ఓ కార్ అదుపుతప్పి బైక్ కు తగిలింది . ఆ సమయంలో బైక్ పై ఉన్న తండ్రి కొడుకులకు స్వల్ప గాయాలయ్యాయి, అటుగా వెళు న్న సత్యవతి రాథోడ్ ,వారి సిబ్బంది సాయంతో కిందపడిన క్షతగాత్రులను పైకి లేపి .
అనంతరం వారికి మంచినీరు అందించి,గాయలయిన చిన్నబాబుకి స్వయంగా మొహం కడిగి, అంబులెన్స్ లో ఎక్కించి ఆస్పత్రికి తరలించారు . డాక్టర్లతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంపై తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఉప సభపతి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే, డాక్టర్ రాంచందర్ నాయక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు...**

**అక్షర వేదం /మరిపెడ మండలం :-నవంబర్ 17.**



సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో పలువురు నిరపరాధుల ప్రాణాలు కోల్పోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఉప సభపతి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే, డాక్టర్ రాంచందర్ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి గురించి వస్తున్న సమాచారం మరింత కలచివేస్తోందని ఆయన అన్నారు.
ప్రమాదంలో మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో ఉండటం హృదయాన్ని మరింత కలతపెట్టే విషయం అని తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఉప సభపతి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే, డాక్టర్ రాంచందర్ నాయక్ విచారించారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని, బాధిత కుటుంబాలు ఈ కష్ట సమయంలో ధైర్యం కోల్పోకుండా భగవంతుడు వారి వెంట ఉండాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, బాధిత కుటుంబాలకు అన్ని విధాల సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# వెన్నెలకే పోటీ ఇస్తున్న కృతి..

21 సెప్టెంబరు 2003న ముంబైలోని కర్నాటక మంగళూరుకు చెందిన తుళు కుటుంబంలో జన్మించింది అందాల తార కృతి శెట్టి. ఈ ముద్దుగుమ్మ తండ్రి కృష్ణ శెట్టి ఓ వ్యాపారవేత్త, తల్లి నీతి శెట్టి ఫ్యాషన్ డిజైనర్ గా చేస్తున్నారు. చాల చిన్న వయసులోనే టీవీలో వచ్చే కొన్ని ప్రకటనలలో మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది చిన్నతనం కృతి శెట్టి ఐడియా, షాపర్స్ స్టాప్, పార్లే, లైఫ్‌బాయ్ వంటి పలు బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ ను చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. కృతి 2019లో హిందీ చిత్రం సూపర్ 30లో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. కృతిశెట్టికి 2021లో వచ్చిన తెలుగు చిత్రం ఉప్పెనతో గుర్తింపు లభించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూలు చేసి విజయం సాధించింది. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కిన ఉప్పెన సినిమా భారీ విజయాన్ని అందుకుంది. అలాగే ఈ సినిమాలో కృతిశెట్టి నటనకు ప్రశంసలు అందాయి.ఆ తర్వాత ఆమె శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు వంటి చిత్రాల్లో నటించి వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించింది. అయితే, ఆ తర్వాత ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ, మనమే వంటి కొన్ని చిత్రాలు కమర్షియల్ గా నిరాశపరిచాయి. దీంతో తెలుగులో కృతిశెట్టికి అవకాశాలు తగ్గాయి.గత ఏడాది మలయాళంలో ARM అనే సినిమాలో నటించింది. ఇది బ్లక్ బస్టర్ అయింది. ప్రస్తుతం ఈ చిన్నది తమిళ సినిమాలపై దృష్టి సారించింది. కార్తీకి జోడిగా వా వాతియార్, ప్రదీప్ రంగనాథన్ సరసన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, అలాగే జెనీ అనే మూడు తమిళ ప్రాజెక్టుల్లో నటిస్తోంది.






# చిరు-బాబీ మూవీపై క్రేజీ అప్‌డేట్.. షూటింగ్ ఎప్పుడంటే..!


మెగాస్టార్ చిరంజీవి వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే మెగా 158 గా రూపొందుతున్న "మన శంకర వరప్రసాద్ గారు" సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో షూటింగ్ కొనసాగుతోంది. ఆ తరువాత, దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "విశ్వంభర" సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు చిత్రాల తరువాత చిరంజీవి, నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రేజీ లైనప్ తరువాత చిరంజీవి మరోసారి దర్శకుడు బాబీ కొల్లితో సినిమాకు ఓకే చెప్పారు. కేవీఎన్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు ఇటీవలే అధికారిక ప్రకటన కూడా విడుదలైంది.తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన ఫైనల్ స్టోరీ డ్రాఫ్ట్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ఆ డ్రాఫ్ట్‌తో పాటు కోల్‌కతా భాషలో ఒక కోట్‌ను జత చేయడంతో, ఈ సినిమా కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా అని అర్థమవుతోంది. కోల్‌కతా నేపథ్యంలో చిరంజీవి చేసిన గత సినిమా ఎలా ఇండస్ట్రీ హిట్ అయ్యిందో తెలిసిందే. అందుకే, అదే సెట్టింగ్‌లో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్ పైన అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. దర్శకుడు బాబీ కొల్లితో చిరంజీవి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. పక్కా మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 236 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టింది. దీంతో ఈ బ్లాక్‌బస్టర్ కాంబినేషన్ మళ్లీ రాబోతుంది కాబట్టి, అభిమానుల్లో ఉత్సాహం భారీగా పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కు లేటెస్ట్ మ్యూజిక్ సెన్సేషన్ తమన్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు. కోల్‌కతా బ్యాక్‌డ్రాప్, గ్యాంగ్‌స్టర్ థీమ్, బాబీ చిరంజీవి కాంబోని బట్టి ఈ మూవీ బ్లాక్ బస్టర్ విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తుంది.

# శివ వైబ్స్ రీక్రియేట్ చేస్తున్న నాగార్జున..

## ఇంతకీ ఏం ప్లాన్ చేస్తున్నాడేంటి..?



అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు.1989 నాటి కాలం నుండి 2025 వరకు అతడి తేజస్సు సున్నితంగా గాలిలా ప్రయాణిస్తుంది అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది..మరపురానిది..' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.






# భీమ్లానాయక్ భామతో బాలకృష్ణ స్టెప్పులు..

## అఖండ 2 నుంచి జాజికాయ సాంగ్ ఆన్ ది వే

టాలీవుడ్ హిట్ కాంబినేషన్స్‌లో టాప్‌లో ఉంటారు బాలకృష్ణ, బోయపాటి శీను. ఈ ఇద్దరి కలయికలో వస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్ అఖండ 2 . తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎస్ థమన్ అండ్ బాలయ్య టీం మ్యూజికల్ ప్రమోషన్స్ షురూ చేసింది.తాజాగా మేకర్స్ అఖండ 2 సెకండ్ సింగిల్ జాజికాయ జాజికాయను నవంబర్ 18న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వైజాగ్‌లోని జగదాంబ థియేటర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి సాంగ్ లాంచ్ ఈవెంట్ జరుగనుంది. ఈ పాటలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తామీనన్ బాలకృష్ణతో కలిసి డ్యాన్స్ చేయనుంది. ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలిచిపోయేలా కలర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు సాంగ్ లుక్ పోస్టర్ క్లారిటీ ఇచ్చేస్తుంది.ఇప్పటికే లాంచ్ చేసిన అఖండ 2 టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఇక సీక్వెల్‌లో ఫస్ట్ పార్టుకు మించిన స్కోర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని ఇప్పటివరకు థమన్ షేర్ చేసిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. అఖండ 2ను 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# మరో బంఫర్ ఛాన్స్.. కొట్టేసిన 'కోర్టు' భామ

ఇటీవల జో వంటి బ్లాక్ బస్టర్ చిత్రం అందించిన విజన్ సినిమా హౌజ్ బ్యానర్‌లో మరో ఆసక్తికరమైన చిత్రం తెరకెక్కుతుంది. అయితే ఇది తెలుగు, తమిళంలో ఏక కాలంలో రూపొందనుండడం విశేషం. ఇప్పటికే.. 'కోజిపన్నై చెల్లదురై', 'కానా కానమ్ కాలంగల్' వంటి చిత్రాల్లో అద్భుత నటనతో అందరినీ ఆకట్టుకున్న ఏగన్ హీరోగా నటిస్తుండగా, తెలుగు 'కోర్ట్' చిత్రంతో అందరినీ ఆకట్టుకున్న శ్రీదేవి , 'మిన్నల్ మురళి' ఫేమ్ ఫెమినా జార్జ్ ఈ చిత్రంలో కథానాయికలుగా నటించనున్నారు.ఈ సినిమాకు సంబంధించిన విషయాలు ఈ చిత్రం గురించి మేకర్స్ ఇటీవల అధికారికంగా ప్రకటించారు. గతంలో 'ఆహా కళ్యాణం' అనే తమిళ వెబ్ సిరీస్ డైరెక్ట్ చేసిన యువరాజ్ చిన్నసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండగా, తెలుగులో బేబీ, కోర్ట్ వంటి సినిమాలతో మంచి పేరు దక్కించుకున్న విజయ్ బుల్గానిన్ సంగీతం అందించనుండడం గమనార్హం.'జో' విజయం తర్వాత మంచి కథలతో, కంటెంట్ డ్రైవెన్ సినిమాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న నిర్మాతలు డా. డి. అరుళనందు, మాథ్యూయో అరుళనందు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే విధంగా ఎలాంటి రాజీ పడకుండా ఈ ప్రాజెక్ట్‌ను భారీగా నిర్మించనున్నట్టు తెలిపారు. తారాగణం, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలు, కథకు సంబంధించిన ముఖ్య సమాచారం, షూటింగ్ షెడ్యూల్ వంటి అంశాలను త్వరలోనే యూనిట్ అధికారికంగా ప్రకటించనుంది.ఇదిలాఉంటే.. శ్రీదేవి ఇప్పటికే తమిళంలో రెండు, తెలుగులో ఓ రెండు చిత్రాలు చేస్తుండగా ఇప్పుడు మరో తమిళ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వరుస ఛాన్సులతో దూసుకుపోతుంది. మరి ఈ అమ్మడు ఏ రేంజ్‌లో తన టాలెంట్ చూపిస్తుందో ఎదురు చూడాల్సిందే.